క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ లక్ష్మీభార్గవి అన్నారు. పీహెచ్‌సీలో గురువారం ఆరోగ్య సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ క్లీనిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. క్యాన్సర్, టీబీ, కుష్టు వ్యాధిగ్రస్తుల అనుమానితులను గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. నెలవారి రిపోర్టులు సకాలంలో అందజేయాలన్నారు. సమావేశంలో సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు బాలు, పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నూరుశాతం నమోదు సాధించాలి



సీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో ఎంఈఓ, హెచ్ఎం

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుసంఖ్య నూరుశాతం పెంచడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కేజీబీవీ విద్యాలయాలను సందర్శించారు. తల్లిదండ్రుల కమిటీల సలహాలు, సహకారం తీసుకుని నూరుశాతం విద్యార్థులు బడిలోనే ఉండేలా చూడాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు


మదన వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: స్థానిక రుక్మిణి సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగిసి 16 రోజుల ఆయిన సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నారాయణ సత్యబాబు స్వామి స్వామివార్ల మూల విగ్రహ, ఉత్సవ మూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, గుర్రం వెంకటేశ్వర్లు, బండ్లా నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి చదువుకోవడమే లక్ష్యం

సింగరాయకొండ: ప్రతి చిన్నారి చదువుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ-1 కత్తి శ్రీనివాస రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో ఆధార్‌కార్డులు లేని విద్యార్థుల కోసం కలెక్టర్ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారని, స్టడీ సర్టిఫికెట్, పేరెంట్, ప్రధానోపాధ్యాయుడు కలిసి సంతకం చేసిన అప్లికేషన్‌ను తీసుకుని వీఆర్‌ఓకు అందజేస్తే జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ మంజూరు చేస్తారని, దాని ప్రకారం ఆధార్ కార్డు మంజూరుకు అవకాశం ఉ,టుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా హింసిస్తే వారిపై పోక్సో కేసు నమోదవుతుందని, విద్యార్థినులతో చర్చించి ఇబ్బందుల్లో ఉన్న వారి వివరాలు గుర్తించాలని సూచించారు. ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిలిచిన పొగాకు వేలం

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం అర్ధంతరంగా నిలిచిపోయింది. గురువారం నుంచి ఏడో రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైంది. క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, తంగెళ్ల, జాల్లపాలెం, అయ్యావారిపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1175 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చినట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. వేలం ప్రారంభం నుంచి లో గ్రేడ్ పొగాకును వ్యాపారులు తిరస్కరిస్తూ వస్తున్నారు. 80 బేళ్ల వరకు వేలాన్ని కొనసాగించారు. లో గ్రేడ్ పొగాకును వ్యాపారులు తిరస్కరించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పొగాకు వేలాన్ని బహిష్కరించి రోడ్డు మీద ధర్నా నిర్వహించారు. 80 బేళ్లలో 54 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 26 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280, కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.240.78గా నమోదైంది. వేలంలో ఎనిమిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

కనిగిరిరూరల్: ప్లాస్టిక్ కవర్లను అమ్మినా.. వినియోదారులు అందచేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మాధవరావు అన్నారు. పట్టణంలోని షాపులను గురువారం విస్తృత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ 120 మైక్రోన్ మందం తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించినట్లు తెలిపారు. షాపుల యజమానులు, పట్టణ ప్రజలు జ్యూట్ బ్యాగులు, లేదా గుడ్డసంచులను వాడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానాలు విధిస్తామన్నారు. మేనేజర్ ప్రసాద్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రారంభానికి ఎదురుచూస్తున్న పామూరు 4వ రైతుసేవాకేంద్ర భవనం


అర్ధంతరంగా నిలిచిన పామూరు రైతు సేవా కేంద్రం, ఆరోగ్యమందిర్

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

- ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనాలు
- పూర్తయి కొన్ని, పూర్తికాక మరికొన్ని నిరుపయోగంగా భవనాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నీరుగారుతున్న గ్రామస్వరాజ్యం లక్ష్యం



ప్రారంభానికి ఎదురుచూస్తున్న పామూరు సచివాలయ భవనాలు

పామూరు:

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య పాలనకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వ పాలన ప్రజలవద్దకే తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2 వేల మందికి ఒక గ్రామ సచివాలయం, ప్రతి 4 వేల మంది పౌరులకు ఒక వార్డు సచివాలయం ఏర్పాటుచేశారు. ఈ సచివాలయాలద్వారా మొత్తం సుమారు 35 ప్రభుత్వ శాఖలకు సంబందించిన 540 రకాల సేవలను అందించడమే లక్ష్యంగా సచివాలయాలు ఏర్పాటుచేసి వలంటీర్ల ద్వారా పథకాలను సైతం ఇళ్లవద్దకే చేర్చారు.నాడు సచివాలయ వ్యవస్థ ప్రారంభంలో అద్దెభవనాల్లో సచివాలయ భవనాలు ఏర్పాటుచేశారు. ఆ తరువాత భవనాల నిర్మాణాలు చేపట్టి కొన్ని సొంతభవనాల్లోకి మార్చగా నూతన భవనాల్లో సచివాలయ సేవలు అందిస్తున్నారు. కాగా మరికొన్ని నిర్మాణం పూర్తికాగా ఎన్నికల కోడ్ రావడంతో భవనాల ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

భవనాలకు కూటమి గ్రహణం..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా నిర్మాణాలు పూర్తయిన భవనాల ప్రారంభాన్ని విస్మరిస్తోంది. పామూరుతో మండలంలో మొత్తం 19 సచివాలయాలు ఉండగా వీటిలో అధికశాతం నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని సచివాలయ భవనాల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. కాగా నిర్మాణాలు పూర్తయి ఏడాది కావస్తున్నా నేటికి కొన్ని భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. పామూరులో మొత్తం 4 సచివాలయాలు ఉండగా ఒకటవ సచివాలయంలోనే కింద, పైన 1, 2, 3, 4 సచివాలయ సేవలు, పక్కన ఉన్న పాడుబడ్డ వైద్యశాల భవనంలో మరికొన్ని సేవలు అందిస్తున్నారు.

ప్రారంభించేదెప్పుడు..?

3, 4, సచివాలయ భవనాలను స్థానిన తహసీల్దార్ కార్యాలయం పక్కనే ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ప్రాంతంలో నిర్మించారు. వీటి నిర్మాణం పూర్తయి ఏడాదిపైగా దాటింది. అయినా నేటికి వాటిని ప్రారంభించకపోవడంతో అవి నిరుపయోగంగా ఉండటమే కాకుండా కార్యాలయ డోర్లు, కిటికీలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అదేవిధంగా కిటికీల అద్దాలు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టడంతో ఆస్తి నష్టం కూడా ఏర్పడింది. ఇదిలాఉంటే ఒకే కార్యాలయంలో ఇరుకుగా సేవలు అందించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

అదేబాటలో ఆరోగ్య మందిర్‌లు, రైతుసేవా కేంద్రాలు

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, రైతులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన రైతు సేవాకేంద్రాలు కూడా కూటమి ప్రభుత్వ చిన్నచూపుతో ప్రారంభానికి నోచుకోవడంలేదు. పామూరులో సచివాలయం 4 పరిధిలో రైతుసేవాకేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్నా నేటిక ప్రారంభానికి నోచుకోకపోగా రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. వాటి పక్కనే సచివాలయం-3 కు సంబంధించి ఆరోగ్యమందిర్, రైతుసేవాకేంద్రం నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణ పనులు నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తచేయకపోగా, పూర్తయిన భవనాలను ప్రారంభించి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం ప్రజలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. తక్షణం నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభించి ప్రజలకు సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

> **పూర్తయిన భవనాలను ప్రారంభించాలి:**
>
> 
>
> గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతుసేవాకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లు పూర్తయ్యాయి. నిర్మాణాలు పూర్తయిన భవనాలను తక్షణం ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు అందించాలి. అదేవిధంగా పూర్తికాని భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలి.
>
> ఎలికా అచ్చయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, వగ్గంపల్లి

ఉపేంద్ర చౌదరి మృతి పార్టీకి తీరని లోటు

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


ఉపేంద్ర చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాదాసి వెంకయ్య

కొండపి: మండలంలో పార్టీ బలోపేతానికి ఉపేంద్ర చౌదరి ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని కట్టవారిపాలెంలో ఉపేంద్ర చౌదరి స్వగృహంలో గురువారం జరిగిన దశదినకర్మకు సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపేంద్ర చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్‌గా, సొసైటీ అధ్యక్షునిగా పార్టీ కోసం ఎనలేని సేవలందించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కోసం ఎంతో పాటుపడ్డారన్నారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ తన సొంత కార్యాలయాన్ని పార్టీ సేవలు కోసం వినియోగించిన గొప్ప వ్యక్తి అన్నారు పార్టీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ చిన్న వయసులో ఉపేంద్ర సేవలు కోల్పోవడం బాధాకరమన్నారు. పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, ఇంటలెక్చువల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజీవ్ చౌదరి రావెళ్ల, వైస్ ఎంపీపీలు, వేముల ప్రసాద్ రావులపల్లి కోటరాజు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీలో చేతివాటం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని పైడిపాడు గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పచ్చిరొట్టె ఎరువులు సక్రమంగా పంపిణీ చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ రైతు సేవా కేంద్రంకు 10 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయించారు. వీటిని సబ్సిడీపై ఆ కేంద్రం పరిధిలోని పైడిపాడు, అక్కచెరువుపాలెం, రెడ్డిపాలెం గ్రామాలకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ అప్పటి వ్యవసాయాధికారి ఆదేశాల ప్రకారం అక్కచెరువుపాలెం గ్రామానికి మాత్రం పూర్తిగా ఇచ్చి రెడ్డిపాలెంలో అరకొరగా ఇచ్చారని, పైడిపాడులో మాత్రం ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారు అడిగినా ఒక్క కేజీ కూడా ఇవ్వలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో పొగాకు ప్రధాన పంటగా పండిస్తామని, పచ్చిరొట్టె ఎరువుగా జనుము పండిస్తే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. విత్తనాల పంపిణీ లో పక్షపాతం చూపటమేందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక ఈ ప్రాంతంలో జూలై 10వ తేది కల్లా పొలాల్లో విత్తనాలు చల్లుకుంటారని అదును దాటితే ఉపయోగం ఉండదని రైతులు తెలియజేస్తున్నారు. పైడిపాడు గ్రామానికి జనుము విత్తనాలు సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు. ఏఓ కాశీవిశ్వనాథ్‌ను వివరణ కోరగా పైడిపాడు రైతు సేవా కేంద్రం క్రింద 10 క్వింటాళ్లు పంపిణీ చేశారని, మండలంలో మరో 30 క్వింటాళ్ల జనుము అవసరమని పంపించామని, అవి రాగానే అవసరమైన రైతులందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు.

363 బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం నిర్వహించిన వేలంలో 363 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. తూర్పునాయుడు పాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1022 బేళ్లను తీసుకురాగా 659 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.224.36 పలికింది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల బాలిరెడ్డి

కనిగిరిరూరల్: మున్సిపల్, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసి నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జుల బాలిరెడ్డి అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, పారిశుధ్య, ఇంజినీరింగ్, కోవిడ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్, పారిశుధ్య కార్మికులకు వర్తింప చేయాలన్నారు. తల్లికి వందనంలో మున్సిపల్ కార్మికుల పిల్లలకు అర్హత లేకుండా చేయడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. సూపర్‌పథకాల అమలులోని నిబంధనలు కార్మికుల పాలిట శాపంగా మారాయన్నారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ, అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసి మండల అధ్యక్షుడు ఎస్‌కే ఖాశింపీరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లూరి కోటయ్య, సీహెచ్ అశోక్, జీ కిరణ్, సయ్యద్ ఇమాం, గులాం, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాల్లోని అధికారులకు సమ్మె నోటీసులను అందచేశారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేసి, పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బషీరా, ఎం సీతా, జి. శారద, రామ సుబ్బులు, సీహెచ్ లక్ష్మయ్య, చార్లస్, నరేంద్రా, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే కుట్రలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కూటమి సర్కార్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కల్గిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అడ్డుకోవడమే లక్ష్యంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్గిన మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రత పట్ల కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా, కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. జగన్ పర్యటనలో దారి పొడవునా వేలాది మంది జనం తరలి వస్తుండటం ప్రభుత్వ పెద్దలను కలవర పెడుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తాను 40 ఏళ్ల సీనియర్‌నని తరచూ చెప్పుకునే చంద్రబాబు నాయుడు పూర్తి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

వృద్ధులకు ఇంటివద్దే రేషన్ అందజేయాలి

సింగరాయకొండ: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 65 ఏళ్ల వృద్ధుల రేషన్‌కార్డులు 14,130 ఉన్నాయని వీరందరికి రేషన్ ఇంటివద్దే డోర్ డెలవరీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కాశయ్య అన్నారు. మండలాల వారీగా సింగరాయకొండలో 2,276, కొండపిలో 3,138, మర్రిపూడిలో 1,586, పొన్నలూరులో 1,974, టంగుటూరు లో 2,961, జరుగుమల్లిలో 2,195 మందికి తప్పనిసరిగా రేషన్ అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.

రమేష్‌ను పరామర్శించిన ఆదిమూలపు


వేముల రమేష్‌ను పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేముల రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయన చౌటపాలెం వెళ్లి పరామర్శించారు. అనంతరం అనారోగ్య వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, నియోజవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు సుల్తాన్, చిన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, రామయ్య,బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డులు పొందాలి

సీఎస్‌పురం(పామూరు): కౌలు రైతులంతా సీసీఆర్సీ కార్డులు పొందాలని తహసీల్దార్ షేక్ ఎండీ హుస్సేన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, వీఏఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: అర్హులందరికీ సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, వీఏఏలు, ఎంపీఈఓలు, వీహెచఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఓ రవికుమార్, గోపికృష్ణ, ఆర్ఐ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కొండపి: మండలానికి 1175 కౌలు రైతు కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఎం మాల్యాద్రి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి, సహాయ గణాంక అధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు విధిగా వేయించాలి


మేకలకు నట్టల నివారణ మందువేస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీఏ రవి

సీఎస్‌పురం(పామూరు): రైతులు, పశుపోషకులు విధిగా తమ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ డాక్టర్ బి.రవి అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లె గురువారం డాక్టర్ మునీర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సామూహిక గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జేడీఏ మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామాలైన చెన్నపునాయునిపల్లె, వి.బైలు గ్రామాల్లో వారంలో ఒకరోజు సంచార పశువైద్యశాల అందుబాటులో ఉంచుతామన్నారు. సీఎస్‌పురం ఏడీఏ ఆర్.రమేష్, జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ తోడేటి గోపి, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు


పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


కనిగిరిలో ప్రతిజ్ఞలో చైర్మన్ గఫార్, సీఐ విజయభాస్కర్‌రావు తదితరులు

సింగరాయకొండ: గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఏఆర్‌సీఅండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు మాదక ద్రవ్యాల సమాచారం తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్, సీఐ ఎం శివకుమారి, ఎస్సై టి.రాజశేఖర్‌నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతా మేలుకో భవితను మలచుకో అనే నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సేవించి భవితను ఛిద్రం చేసుకోవద్దన్నారు. ఏఎస్సై షేక్ జిలానీబాష, సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎక్సైజ్ సీఐ ఆర్ విజయభాస్కర్ రావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం దినోత్సవం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఆర్ విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో యువత అనేక నేరాల్లో ఇరుక్కుంటున్నారని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఖాశింపీరా,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జానీ షాహీద్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.రామరాజు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరికుంట సురేష్, మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో వివిధ మతాల పెద్దలతో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పండుగల్లో, ఉత్సవాల్లో పాటించాల్సిన నియమాలు, ఊరేగింపులో డప్పులు, బాజా భజంత్రీలు వాయించే విషయంలో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై ఇరు మతాల పెద్దలకు తగు సూచనలు చేశారు. ఈ మేరకు తగు బైలా రాశారు. ఆ బైలా ప్రకారం ఇరు మతాల వారు నడుచుకోవాలని సూచించారు. అలా కాకుండా ఇరు మతాల వారు ఏమైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. సీఐ ఎస్‌కే ఖాజావలి,ఎస్సై టీ శ్రీరాం,మత పెద్దలు పాల్గొన్నారు.